
పెద్దపల్లి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో మాట్లాడుతున్న పెద్దపల్లి ఆర్డీవో



మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేయనున్న సెల్ఫీ పాయింట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, తదితరులు


పెద్దపల్లి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ స్టేషన్లకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది

ఎన్టీపీసీలో పోలింగ్ సామగ్రితో పీఎస్‌లకు తరలుతున్న సిబ్బంది

# నేడే పోలింగ్

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- ఏడు నియోజకవర్గాల్లో 1850 కేంద్రాలు.. తరలిన సిబ్బంది
- పెద్దపల్లి, రామగుండం, ధర్మపురిలో 7 నుంచి 6 గంటల వరకు..
- మంథని, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లిలో 4 గంటల వరకు పోలింగ్
- భారీగా పోలీస్ బందోబస్తు, ఇతర రాష్ట్రాల నుంచి రాక..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేసింది. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు భారీగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఆదివారం మధ్యాహ్నం పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లు, ఇతర సామగ్రి పట్టుకుని సిబ్బంది పట్టణాలు, గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని జిల్లాలో రామగుండం, మంథని, పెద్దపల్లి, జగిత్యాల జిల్లా ధర్మపురి, మంచిర్యాల జిల్లా మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో 1850 పోలింగ్ కేంద్రా


ఎన్టీపీసీ ఎన్నికల విధులకు సిద్ధమవుతున్న సిబ్బంది

లను ఏర్పాటు చేశారు. వీటిని 204 సెక్టార్లుగా విభజించారు. రామగుండంలో 260, మంథనిలో 290, పెద్దపల్లిలో 290, చెన్నూర్‌లో 227, బెల్లంపల్లిలో 227, మంచిర్యాలలో 287, ధర్మ పురిలో 269 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఈ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 15,96,430 ఓటర్లు ఉండగా, పురుషులు 7,87,705 మంది, మహిళలు 8,08,622 మంది, ఇతరులు 52 మంది, సర్వీసు ఓటర్లు 1432 మంది ఉన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి ప్రారంభం కానున్నది. పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎండలు మండుతున్న దృష్ట్యా పోలింగ్‌ను 5 గంటల నుంచి 6 గంటలకు, అదనంగా ఒక గంట పెంచారు. సమస్యాత్మక నియోజకవ ర్గాలైన మంథని, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోలింగ్ సమయంలో ఎలాంటి మార్పు లేదు. సాయంత్రం 4 గంటల వరకే ముగించనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 5:30 గంటల నుంచి 6:30 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. వీవీ ప్యాట్‌లు, ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించనున్నారు. మొత్తం 50 ఓట్ల వరకు పోలింగ్ జరపనున్నారు. వీవీ ప్యాట్‌లో స్లిప్పులు పడుతున్నాయా, లేదా అని పరిశీలించనున్నారు. పోలింగ్ సమయం ముగిసేలోపు పోలింగ్ బూతుల్లో ఎంత మంది ఉంటే వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకునే వరకు సిబ్బంది పోలింగ్‌ను కొనసాగించనున్నారు.

**● పోటీలో 42 మంది అభ్యర్థులు..**

పెద్దపల్లి పార్లమెంట్ నుంచి 42 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరితో పాటు నోటా ఉంటుంది. దీంతో ప్రతి పోలింగ్ కేంద్రంలో 3 ఈవీఎంల చొప్పున 5550, 1850 కంట్రోల్ యూనిట్లు, 1850 వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో ఈవీఎంలో 16 మంది అభ్యర్థులకు అవకాశం ఉంటుంది. 2 ఈవీఎంలలో 32 మంది, మూడవ ఈవీఎంలో 10 మంది అభ్యర్థులతో పాటు ఒక నోటా ఉంటుంది. 1850 పోలింగ్ స్టేషన్లలో 221 కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలు, 38 అతిసమస్యాత్మక కేంద్రాలు 38 ఉన్నట్లు గుర్తించారు. 1259 కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ గమనించేందుకు వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. 462 కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు 1850 మంది పీవోలు, 1850 మంది ఏపీవోలు, 3700 మంది ఓపీవోలు, మొత్తం 7800 మంది, 139 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. మహిళల కోసం ప్రత్యేకంగా 35 కేంద్రాలు, దివ్యాంగుల కోసం కేంద్రాలు 7, మోడల్ పోలింగ్ కేంద్రాలు 23, యువకుల కోసం 7 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సందర్భంగా ఓటర్లను అభ్యర్థులు ప్రభావితం చేయకుండా ఉండేందుకు 28 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 26 సర్వేలెన్స్, 26 వీడియో సర్వేలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్రంలో ఉండే పోలింగ్ సిబ్బందే గాకుండా ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి పోలీస్ బలగాలను మోహరించారు. ఈ ఎన్నికల సందర్భంగా 80 ఏళ్ల పైబడిన వాళ్లు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఉండి ఓట్లు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించగా 1557 మంది ఓటు హక్కును వినియోగించు కున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో భాగంగా 12,425 ఓట్లు పోలయ్యాయి. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎన్నికల పరిశీలకులు సందర్శించి పలు సూచనలు చేశారు. పోలింగ్ అనంతరం పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి నియోజకవ ర్గాల్లోని సిబ్బంది ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లను డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తీసుకరానున్నారు. అక్కడి నుంచి వాటిని సెంటినరీకాలనీలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలించనున్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కల్లలోగల ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మరో కౌంటింగ్ కేంద్రానికి మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లను తరలించనున్నారు. జూన్ 4న రెండు చోట్ల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

**నియోజకవర్గాల వారీగా ఓటర్లు..**

| నియోజకవర్గం | పోలింగ్ | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం | సర్వీస్ ఓటర్లు |
|---|---|---|---|---|---|---|
| రామగుండం | 260 | 109826 | 1,09,870 | 27 | 219223 | 210 |
| మంథని | 290 | 117352 | 122329 | 18 | 239699 | 155 |
| పెద్దపల్లి | 290 | 126719 | 130466 | 07 | 257192 | 269 |
| చెన్నూర్ | 227 | 96019 | 97752 | 07 | 193778 | 140 |
| బెల్లంపల్లి | 227 | 87283 | 89219 | 12 | 176514 | 172 |
| మంచిర్యాల | 287 | 138064 | 140648 | 26 | 278738 | 165 |
| ధర్మపురి | 269 | 112442 | 118338 | 06 | 230786 | 141 |
| **మొత్తం** | **1850** | **787705** | **808622** | **103** | **1596430** | **1432** |


బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు


పోలింగ్ కేంద్రాలకు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది


ఎన్టీపీసీలో పోలింగ్ సామగ్రితో బస్సు ఎక్కుతున్న సిబ్బంది


రామగిరి మండలంలోని జేఎన్టీయూలో ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

## పోలింగ్ విధులపై అప్రమత్తంగా వ్యవహరించాలి

**- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్**


డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రామగిరి, మే 12: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ఆదివారం మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 260 పోలింగ్ కేంద్రాల్లో సజావుగా పోలింగ్ జరిగేందుకు పూర్తిచేసినట్లు తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న 1850 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. వేసవి దృష్ట్యా ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యంతోపాటు టెంట్స్ వేయించినట్లు తెలిపారు. జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అసత్య ప్రచారాలు చేస్తే పీడీ యాక్టు

**- ఫేక్ వీడియోలో ఫార్వర్డ్ చేయవద్దు : సీపీ శ్రీనివాస్**

కోల్‌సిటీ, మే 12: లోక్‌సభ ఎన్నికల వేళ సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు మార్ఫింగ్ వీడియోలతో అసత్యప్రచారాలు చేస్తున్నారని, వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని రామగుండం సీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. పాత వీడియోలను మార్ఫింగ్ చేసి కొన్ని పార్టీలకు చెందిన వ్యక్తులపై అసభ్యంగా, అసత్య ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రూప్‌అడ్మిన్లపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఇలాంటి పోస్టులు గ్రూపుల్లో పెట్టగానే అడ్మిన్లు డిలీట్ చేయాలని, అవసరమైతే అలాంటి వారి నంబర్‌ను బ్లాక్ చేయాలన్నారు. ఇలాంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

**ఫేక్ వీడియోల కలకలం..**

కోల్‌సిటీ, మే 12: లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు కొన్ని గంటల సమయమే ఉందనగా సోషల్ మీడియాలో ఫేక్ వీడియాలో కలకలం సృష్టిస్తున్నాయి. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కొన్ని ఛానళ్ల పేర తప్పుడు కథనాలతో ఫేక్ వీడియోలను వైరల్‌చేశారు. చెన్నూరు నుంచి మొదలు ధర్మపురి వరకు ఈవీడియోలను వైరల్ చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ అభ్యర్థిని టార్గెట్‌గా చేసుకుని నాలుగు ఫేక్ వీడియోలు తయారుచేసి వైరల్ చేయడంతో ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రామగుండం సీపీ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వీడియోలు ఎవరు క్రియేట్ చేసి పోస్టు చేశారనే విషయంపై సైబర్ క్రైమ్ రంగంలోకి దిగింది. దీంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది.

## మాతృమూర్తులకు ఘన సన్మానం



మళయాళ సద్గురు గీతామందిరంలో సన్మానం

కరీంనగర్ కల్చరల్, మే12: ఆది శంకరాచార్యులు, భగవద్రామానుజుల జయంతి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతాభక్త సమాజం సభ్యులు మఠాధిపతి విష్ణుసేవానందగిరిస్వామికి పాదపూజ చేశారు. స్వామీజీ ప్రవచనం చేస్తూ రామానుజ, శంకరాచార్యుల వైభవాన్ని, మాతృ మూర్తుల ప్రాశస్త్యాన్ని వివరించారు. మహిళా దినోత్సవంలో భాగంగా 62 మంది మాతృమూర్తులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు బండ సత్తయ్య, కార్య నిర్వాహకుడు పుప్పల రామేశం, సభ్యులు గుండ రాధాకిషన్, వేంకటయ్య, దామోదర్, భూపతి, గంగన్న, రవీందర్, ప్రభాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పలుచోట్ల గాలివాన.. ప్రజల ఇబ్బందులు



కంచర్లలో విరిగిపడిన కరెంటు స్తంభం



చందుర్తి మండలంలో మృతి చెందిన ఆవు వద్ద రైతు మల్లారెడ్డి

ఎల్లారెడ్డిపేట, మే 12: ఎల్లారెడ్డిపేట మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసింది. సుమారు గంటపాటు గాలివానకు మండల కేంద్రంతోపాటు, అక్కపల్లి, తిమ్మాపూర్, గుండారం తదితర గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. రాకపోకలకు అంతరాయం కలుగకుండా స్థానికులు, యువకులు చెట్లను తొలగించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ధాన్యం కుప్పలపై ప్లాస్టిక్ కవర్ల కప్పారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన ధాన్యం తూకం వేయడంలో నిర్లక్ష్యం వల్ల ఒక్కసారిగా వచ్చే వానకు తడిసిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు.

### వీర్నపల్లిలో విరిగిపడిన స్తంభాలు

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు కంచర్ల గ్రామంలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన గాలివానకు కరెంటు స్తంభాలు నెలకొరిగాయి. పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఈదురుగాళ్లకు టార్పాలిన్ కవర్లు ఎగిరిపోవడంతో వరి ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిశాయి. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతుల కోరుతున్నారు.

### పిడుగుపాటుతో ఆవు మృతి

చందుర్తి: మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో పాటు పిడుగు పడటంతో మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఓ ఆవు మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పూడూరు మల్లారెడ్డి చెందిన ఆవు పిడుగు పడి మృతి చెందింది. ఆవు విలువ దాదాపు రూ 50 వేలు ఉంటుందని, బాధిత రైతులు ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

### కొడిమ్యాల మండలంలో..

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలో ఆదివారం మధ్యాహ్నం స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ప్రజలకు ఉక్కపోత నుండి ఉపశమనం లభించింది. అరగంట సేపు వీచిన ఈదురు గాలులకు కోనాపూర్ నుంచి కొడిమ్యాలకు వచ్చు దారిలో చెట్టు నేలకూలింది, తిర్మలాపూర్ గ్రామంలో వీచిన ఈదురు గాలులకు అదే గ్రామానికి చెందిన తైదల అంజయ్య, శాంతయ్యకు చెందిన ఇళ్ల రేకులు లేచిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

### ఖనిలో భారీ వర్షం

కళ్యాణ్‌నగర్, మే 12: నిన్న మొన్నటి వరకు భానుడి ప్రతాపంతో భగభగమన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఆదివారం సాయంత్రం కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. ఆదివారం పగలు 40.5డిగ్రీల ఉష్ణోగత నమోదు కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 28.0డిగ్రీలు నమోదయింది. మే లో భానుడు ప్రతాపం చూపగా ఆదివారం కురిసిన వర్షంతో కొంత ఉపశమనం కలిగింది. ఎన్నికల నేపథ్యంలో ఆయా పోలింగ్ సెంటర్లకు ఈవీఎంలు చేరిన తరువాత వర్షం పడడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



కొడిమ్యాలలో లేచి కింద పడిన రేకులు



కొడిమ్యాలలో విరిగిపడిన చెట్టు



గోదావరిఖనిలో కురుస్తున్న వర్షం



# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



కరీంనగర్‌లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రంను పరిశీలిస్తున్న సీపీ



ఎన్నికల విధులకు హాజరైన పోలీస్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, మే 12: కమిషనరేట్ వ్యాప్తంగా ఉన్న పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సీపీ అభిషేక్ మొహంతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే అందుబాటులో వుండే సమీప అధికారులకు తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద జనం గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

### ● డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల సందర్శన

కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిరిసిల్ల బైపాస్ రోడ్డులో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సీపీ అభిషేక్ మొహంతి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేసేందుకు వచ్చే మహిళలు, వృద్ధులతోపాటు అన్ని వర్గాల ప్రజలతో సిబ్బంబది సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాంలోకి వెళ్లవద్దని, వారు పిలిస్తేనే వెళ్ళాలని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలన్నారు.

### విస్తృతంగా వాహన తనిఖీలు

కరీంనగర్ క్రైం, మే 12 : పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా ఆదివారం రాత్రి విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ పట్టణంలోని లాడ్జిలు, హోటల్లలో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. లోకసభ ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ మరికొన్ని గంటల్లో ప్రారంభం కానుండగా, రాత్రి సమయంలో అక్రమ డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీలను అరికట్టేందుకు విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ఇష్టారాజ్యంగా చెరువు మట్టి తరలింపు



కనగర్తి చెరువులో అక్రమంగా మట్టి తరలించగా ఏర్పడిన గొయ్యి

ఇల్లందకుంట, మే 12: ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామానికి చెందిన చెరువులో ఇష్టారాజ్యంగా చెరువు మట్టి తరలిస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెరువులోని మట్టిని గృహాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై మండలాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఫిషర్‌మెన్ చైర్మన్ బండి మల్లేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కనగర్తి గ్రామ చెరువులో అక్రమంగా మట్టిని తోడిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కనగర్తి గ్రామానికి చెందిన చెరువులు, కుంటలలోని మట్టిని అమ్ముకుంటూ అధికారులు, రాజకీయ పార్టీ నాయకులకు ముడుపులు అప్పచెప్పుతూ చెరువులను అన్యక్రాంతం చేస్తున్నారన్నారు. చెరువుల్లో మట్టిని తీసే జేసీబీ, ట్రాక్టర్లకు సరైన పత్రాలు లేవని గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ మట్టి మాఫియా కొనసాగుతుందన్నారు. ప్రతి సంవత్సరం ఎండకాలం వచ్చిందంటే చెరువులో నీరు ఎండిపోగానే మట్టి తవ్వకాలకు తెరతీస్తూ గ్రామంలో ఉన్న చెరువులను పనికి రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వాధికారులు స్పందించి చెరువులను కాపాడాలని ఇల్లందకుంట మండల ప్రజలు కోరుతున్నారు.

## చేపల వేటకు వెళ్లి ఒకరి గల్లంతు

ఎల్లారెడ్డిపేట, మే 12: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఆలకుంట రాజు(35) గ్రామ శివారులోని కొత్తకుంట చెరువులో చేపల వేటకు వెళ్లి ఆదివారం రాత్రి గల్లంతు అయ్యాడని కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు స్థానికుల సహాయంతో రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని రాజు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఆదివారం రాత్రి చేపల వేటకు మరో వ్యక్తితో కలిసి వెళ్లిన అతను చీకటి పడిన ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు కొత్తకుంట వద్దకు చేరుకున్నారు. గట్టున బట్టలు, చెప్పులు కనిపించడంతో నీటిలో మునిగిపోయాడని రాజుతో వెళ్లిన వ్యక్తి పేర్కొంటున్నాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, కొత్తకుంటలో రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఓ వైపు చీకటి ఉండడం.. మరో వైపు వర్షం కురవడం వల్ల గాలింపునకు ఆటంకం ఏర్పడింది. భార్య సునీత, తల్లిదండ్రులు నర్సవ్వ, లింగయ్య, కొడుకు అక్కడకు చేరుకుని భోరున విలపిస్తున్నారు. సోమవారం గాలింపు చర్యలు చేపడుతామని పోలీసులు వివరించారు.

### వడదెబ్బతో మహిళ మృతి

శంకరపట్నం, మే 12: శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన కనుకుట్ల రాధా (40) అనే మహిళ ఆదివారం వడదెబ్బకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రెండ్రోజు లుగా ఎండ తీవ్రత ఉద్రిక్తంగా ఉండడంతో తట్టుకోలేక అస్వస్థతకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం

**● నిబంధనలు పాటిస్తేనే మేలు ● ఓటు హక్కు వినియోగానికి ఈసీ ఏర్పాట్లు ● నేడు లోక్‌సభ ఎన్నికల పోలింగ్**

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం దక్కుతుంది. ఓటు హక్కు వినియోగానికి ఎన్నికల సంఘం అమలు చేస్తున్న నిబంధనలను పాటిస్తేనే ప్రయోజనం చేకూరుతుంది. అర్హులందరూ ఓటు వేసేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఓటు సాధారణంగా అందరికీ ఒకేలా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేరుతో పిలుస్తారు.

**● జాబితాలో పేరు లేకుంటే..**

ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు ఉండాల్సిందే. ఒకవేళ పేరు లేకుంటే ఓటు హక్కు వినియోగానికి అనర్హుడు. ఓటరు తన ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందనేది అందుబాటులో ఉండే బీఎల్‌వోల ద్వారా తెలుసుకోవాలి. బీఎల్‌వోలు ఇచ్చిన ఓటరు స్లిప్ వెనుకాల ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పోలింగ్ కేంద్రం సమాచారం లభిస్తుంది.

**● టెండర్ ఓటుకు అవకాశం**

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అప్పటికే వేరే వ్యక్తి తన ఓటును వినియోగించుకున్నాడని తెలిస్తే సదరు ఓటరు ఎన్నికల నిబంధనల మేరకు 49-ఏ ప్రకారం టెండర్ ఓటేసే అవకాశం ఉంటుంది. ఈ ఓటు వేసే వ్యక్తి ఈవీఎంల ద్వారా వేయడానికి వీలులేదు. బ్యాలెట్ రూపంలో ఓటు వేసే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఏపీఓ, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓటరు జాబితాను చెక్ చేసుకుంటారు. ఇప్పుడున్న పరిస్థితిలో దొంగ ఓట్లు వేసే అవకాశం లేదు. జిల్లాలో ఎక్కడా టెండర్ ఓటు నమోదు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**● వీరికే అనుమతి**

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్‌లకు



అవకాశం ఉంటుంది. ఓటరుతో పాటు పసిపిల్లలకు అవకాశం ఉంది. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్స్, సెక్టోరల్ అధికారులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన విలేకరులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన ఇతరులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

**● వీవీ ప్యాట్‌తో**

ఈవీఎంల ద్వారా ఓటు వేస్తే ఓటు పడుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఎన్నికల సంఘం వీవీ ప్యాట్ యంత్రాల ద్వారా సమస్యకు పరిష్కారం చూపింది. వీవీప్యాట్ తెరపై ఓటరు వేసిన గుర్తు కనబడుతుంది. దానితో ఓటరు తాను వేసిన ఓటును నిర్ధారించుకుంటారు. వేసిన ఓటు వీవీ ప్యాట్‌పై కనబడితే పారదర్శకంగా ఓటు వేసినట్లు లెక్క. లేకుంటే పీఓకు ఫిర్యాదు చేయాలి.

**● నిబంధనలు పాటించాల్సిందే**

ఓటు హక్కును వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల గుర్తులు, కండువాలు, వస్త్రాలను ధరించవద్దు. సెల్‌ఫోన్లను తమ వెంట తీసుకెళ్లకూడదు. ఓటు హక్కు వినియోగానికి పోల్ స్లిప్ ప్రమాణికం కాదు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 16 ధ్రువ పత్రాలలో ఏదైనా ఒకటి తీసుకెళ్తే ఓటు వేసేందుకు అవకాశం ఉంది.

**● ఓటింగ్ ప్రక్రియ ఇలా..**

ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి (పీవో), అదనపు ప్రిసైడింగ్ అధికారి (ఏపీఓ) ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓ) విధులు నిర్వహిస్తారు. ఓటర్లు వీరికి సహకరించి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. మొదట ఏపీఓ ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి పేరును పోలింగ్ కేంద్రంలోని ఓటరు జాబితాలో ఉంటే ఓటరు గుర్తింపు, క్రమసంఖ్య పేరు గట్టిగా చదివి వినిపిస్తారు. అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు సరేనని ఒప్పుకుంటే ఓటరు ఎడమ చేతి చూపుడు వేలును చెక్ చేస్తారు. ఓపీఓ-1 మూడు బాధ్యతలు (ఓటరు సిరా చుక్క వేయడం, 17ఏ రిజిస్టార్‌లో పేరు నమోదు, ఓటరు స్లిప్ రాయటం) నిర్వహిస్తారు. దీని తర్వాత ఏపీఓ-2 దగ్గరకు వెళితే పోల్ స్లిప్ తీసుకొని కంట్రోల్ యూనిట్ (సీయూ)లో బటన్ నొక్కి ఓటేసే అవకాశం కల్పిస్తారు. ఓటరు ఓటు వేసే ప్రదేశానికి వెళ్లి ఓటు వేసి బయటకు రావాల్సి ఉంటుంది. ఇలా ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది.

**● సందేహాలు ఉంటే పీవోకు ఫిర్యాదు చేయాలి**

ఓటరుకు ఏమైనా అనుమానాలు, సందేహాలు ఉంటే ప్రిసైడింగ్ అధికారి (పీఓ) కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధానాన్ని పీఓ పర్యవేక్షించి రెండు గంటకొకసారి నమోదు అయిన పోలింగ్ వివరాలను సెక్టోరియల్ ఆఫీసర్‌కు సమాచారం అందిస్తారు.

## పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత

కరీంనగర్ టౌన్, మే 12: పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ బాక్సుల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఇటీవల పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు ఉద్యోగులు వినియోగించుకోగా, బ్యాలెట్ పత్రాలను, హోం ఓటింగ్ బ్యాలెట్ బాక్స్‌లను కలెక్టరేట్‌లో భద్రపరిచారు. కలెక్టరేట్‌లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్‌లు రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఆదివారం రాత్రి కలెక్టరేట్ నుంచి ప్రత్యేక వాహనంలో ఎస్సారార్ డిగ్రీ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు పోలీస్ బందోబస్తు మధ్య తరలించారు. స్ట్రాంగ్‌కు తరలించే ప్రక్రియను కలెక్టర్ పమేలా సత్పతి, పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ అమిత్ కటారియాతో కలిసి పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూంల వద్ద 24 గంటలపాటు బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, రాజకీయ పార్టీల నాయకులు సత్తినేని శ్రీనివాస్, మడుపు మోహన్, సయ్యద్ బర్కత్ అలీ, కళ్యాడపు ఆగయ్య, రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఘనంగా శంకర జయంతి ఉత్సవాలు

ధర్మపురి, మే 12: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళలో ఆలయంలోని శంకరాచార్యులకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పంచోపనిషత్తులతో రుద్రాభిషేకం, హారతి మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. భగవద్రామానుచార్యా జయంతి పురస్కరించుకుని ప్రధాన దేవాలయాల్లో గల అభిషేక మండపంలో రామానుజాచార్యా జయంతి వేడుకల్లో భాగంగా షోడశోపచార పూజ, పంచామృత అభిషేకం సూక్త పారాయణంతో, అష్టోత్తర శతనామ పూజ దివ్య ప్రభంద పారాయణం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వేదపండితులు మదు శంకర్‌శర్మ, సంగనభట్ల దిలీప్‌శర్మ, గుండి శ్రీనాథ్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు చక్రపాణి కిరణ్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, జూనియర్ అసిస్టెంట్ దేవయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**జగిత్యాల టౌన్ :** జగిత్యాల జిల్లా కేంద్రలోని శుభమస్తు పంక్షన్ హాలులో ఆదివారం జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం హోమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉన్నారు.



ధర్మపురి శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు

**కథలాపూర్ :** అద్వైత సిద్ధాంత బోధకుడిగా, హిందువులకు నిత్య స్తోత్రాలను అందించిన జగద్గురువు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు మండలంలోని సిరికొండలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం యువకులు ఆది శంకరాచార్యుని చిత్రపటంకు పూలమాలలు వేసారు. సనాతన ధర్మం బలోపేతం చేయడానికి కాళికా, గోవర్ధన, శారదా, జ్యోతిర్మఠాలను స్థాపించిన ఘనత శంకరాచార్యునికే దక్కిందన్నారు. 108 స్తోత్రాలు, గ్రంధాలు రచించిన శంకరాచార్యున్ని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంచాల మధుసూధన్, దొమ్మాటి గంగనర్సయ్య, అల్లె గంగాధర్, కాశోజి భాస్కర్, నాంపల్లి శ్రీధర్, గట్ల మహేశ్, లస్మయ్య, కృష్ణ, రమేశ్ తదితరులు ఉన్నారు.



రామగుండం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

## పోలింగ్‌కు సిద్ధం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పోలింగ్‌కు అధికారులు అంతా సిద్ధం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి బందోబస్తు మధ్య పోలింగ్ స్టేషన్లకు ఆదివారం రాత్రి వరకు ఈవీఎంలతో ఎన్నికల సిబ్బంది తరలివెళ్లారు.**



పెద్దపల్లిలో ఎన్నికల విధులకు తరలుతున్న సిబ్బంది



సిరిసిల్లలో సామగ్రితో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది



కోరుట్లలో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది



కరీంనగర్‌లో సామగ్రితో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది

## పవర్‌లూం కార్ఖానాలో అగ్నిప్రమాదం



పవర్‌లూం కార్ఖానాలో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

సిరిసిల్ల క్రైం, మే 12: సిరిసిల్ల పట్టణంలోని బివైనగర్‌లో అంబటి వేణు పవర్‌లూం కార్ఖాణాలో ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వస్త్ర ఉత్పత్తికి సంబంధించిన రూ 2.50 లక్షల ముడి సరుకు దగ్ధమైంది. పవర్‌లూం కార్ఖాణాలో అగ్నిప్రమాదం సంఘటనను వెంటనే స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు తెలియజేయడం వల్ల అగ్నిమాపక యంత్రంతో ఫైర్‌మెన్‌లు సాబీర్, నాగరాజు, నవీన్‌కుమార్‌లు సంఘటనా స్థలానికి సకాలంలో చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే వస్త్ర ఉత్పత్తికి సంబంధించిన ముడిసరుకు కాలిబూడిదైంది. పవర్‌లూం కార్ఖాణాలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అగ్నిమాపక ఇంచార్జి అధికారి టి. నర్సింహాచారి తెలిపారు.

# వైభవంగా పార్వతీ కోటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్గటూర్, మే 12: వెల్గటూరు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోటిలింగాలలో గోదావరి తీరాన కొలువై ఉన్న శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. అందంగా అలంకరించిన కల్యాణ మంటపంపైన అమర్చిన పీఠంపై స్వామివారల ఉత్సవ విగ్రహాలను నిలిపారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, కార్తీక్, శివకిరణ్‌ల మంత్రోచ్ఛరణల మధ్య వైశాఖ శుక్ల పంచమి శంకర జయంతి సందర్భంగా ఆరుద్ర నక్షత్ర యుక్త అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి తరించారు. మహిళ భక్తులు స్వామి వారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రేగొండ వైకుంఠం కళావతి, రేగొండ రామన్న మల్లీశ్వరి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణం వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహాధికారి కాంతారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మానకొండూర్, మే 12: మండలంలోని దేశ్‌రాజ్‌పల్లిలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక్కరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలు అయినట్లు ఎస్‌ఐ సురేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి గ్రామానికి చెందిన మద్దెల తిరుపతి (39) అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనానికి ట్రాక్టర్‌లో శనివారం రాత్రి బయలుదేరారు. రామడుగు మండలంలోని దేశ్‌రాజ్‌పల్లి ఎక్స్ రోడ్డు వద్ద ట్రాక్టర్ వెనకాల వస్తున్న కారు ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తిరుపతి, అతనికి ఇరువైపులా కూర్చున్న కాడే జస్వంత్, తీట్ల విష్ణువర్ధన్ కిందపడిపోగా ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం డ్రైవర్ తిరుపతి మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఇరు వర్గాల ఘర్షణలో ముగ్గురికి గాయాలు

కోరుట్ల, మే 12: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయలయినట్లు పోలీసులు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన దినేష్ జాట్, ఈరాంజాట్, నాన్‌రాంజాట్ కోరుట్ల పట్టణంలో ఐస్‌క్రీం వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరి వద్ద ఈశ్వర్ జాట్, రాజేష్ జాట్‌లు పనిచేసేవారు. ఇటీవల ఈశ్వర్ జాట్, రాజేష్‌జాట్‌లు స్వంతంగా ఐస్‌క్రీం వ్యాపారం చేపట్టారు. ఈ క్రమంలో మిగతా ముగ్గురితో విభేదాలు వచ్చాయి. శనివారం అర్ధరాత్రి వీరి మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో ఈశ్వర్ జాట్, రాజేశ్వర్ జాట్‌లు దినిష్‌జాట్, ఈరాంజాట్, నాన్‌రాంజాట్‌లపై దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

జమ్మికుంట,మే12:పట్టణంలోని కొత్తపల్లికి చెందిన కల్లెపల్లి వెంకట రత్నం (45) గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వెంకటరత్నం టైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. రైల్వే స్టేషన్‌కు దగ్గరలోని ఇంటికి వెళ్తుండగా రెండవ ప్లాట్ ఫాం దగ్గర గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడని తెలిపారు. రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.మృతునికి భార్య సుకన్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య

ధర్మపురి, మే 12: పట్టణానికి చెందిన నూనె సత్యనారాయణ(35) అనే యువకుడు గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ ఇంటిలో ఈనెల 11న మధ్యాహ్నం గొడవపడి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ గురించి వెతికారు. ఆదివారం ఉదయం ధర్మపురికి చెందిన కొందరు జాలర్లు గోదావరి నది బ్రహ్మగుండం నీటిలో మృతదేహం ఉందని తెలిపారు. కుటుంబ సుభ్యులు వెళ్లి మృతదేహం సత్యనారాయణదిగా గుర్తించారు. ఇంట్లో గొడవ పడి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి అన్న నూనె శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

## భారీగా నగదు, మద్యం పట్టివేత

**● జగిత్యాల జిల్లాలో రూ. 3.97 కోట్ల నగదు స్వాధీనం**

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు అయినప్పటి నుంచి ఇప్పటివరకు భారీగా నగదు, లిక్కర్, బంగారాన్ని పోలీసులు, అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఈనెల 10వ తేదీ వరకు సుమారు రూ. 3,97,36,336 విలువ గల నగదు, లిక్కర్, గోల్డ్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో రూ. 2,21,53,310 నగదు ఉంది. అదేవిధంగా సుమారు రూ. 14,43,015 విలువ గల సుమారు 2,769 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 67,45,011 విలువ ఇతర సామగ్రిని సీజ్ చేశారు. రూ. 90 లక్షల విలువల గల 1.506 కేజీల బంగారం, రూ. 3.95 లక్షల విలువ గల 15.81 గంజాయి పట్టుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 612 మంది వ్యక్తులను బైండోవర్ చేశారు. 45 ఆయుధాలు డిపాజిట్ చేశారు.

## మద్యం పట్టివేత

రాయికల్, మే12: మండలంలోని అల్లీపూర్ గ్రామంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా వాహనంలో రెండు మద్యం కాటన్ బాటిళ్లు పట్టుబడ్డాయి. ఇందులో 96 రాయల్ స్టాగ్ 17 లీటర్ల మద్యం పట్టుబడినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద మద్యాన్ని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌టీ టీమ్ వన్ జి.కృష్ణారెడ్డి, ఏఆర్ ఎస్సై విద్యాసాగర్, కానిస్టేబుల్ రాహుల్ ఉన్నారు.

## వైభవంగా రామానుజుల జయంతి

ఇల్లందకుంట, మే 12: ఇల్లందకుంట శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయంలో భగవత్ రామానుజుల 1007 జయంతి వేడుకలు ఆదివారం రాత్రి గ్రామ దేవాలయంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామానుజుల స్వామివారి ఉత్సమూర్తును ఘనంగా అలంకరించి, పల్లెకిలో అసీనులను చేసి బాజాభజంత్రిలు, మేళాతాళాలు నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పల్లెకి సేవలో పాల్గొని పునకింతులయ్యారు.



రామానుజు స్వామివారికి పల్లకి సేవ

## యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ



పనులు పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

గణేష్‌నగర్, మే 12: కరీంనగర్ డివిజన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు. కరీంనగర్ సర్కిల్‌లోని రూరల్ డివిజన్ గుండిలో 15 కెవిఎ డిటిఆర్‌ను లారీ ఢీకొట్టడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రుద్రారం, రంగసాయిపల్లిలో విద్యుత్‌ను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ రూరల్ మండలం సిటిజన్ కాలనీలో 100 కెవిఎ ఓల్డ్ డీటీఆర్‌లో ఇంటర్నల్ సమస్యతో చెడిపోవడంతో తక్షణమే డీటీఆర్ ఏర్పాటు చేశారు. హుజూరాబాద్ డివిజన్ జమ్మికుంటలో గాలి దుమారంతో రెండు 8 మీటర్స్ పోల్స్ పడిపోవడంతో అధికారులు తక్షణమే స్పందించి పునరుద్ధరించారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 9440811444కు ఫోన్ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డీఈ రూరల్ తిరుపతి, లక్ష్మారెడ్డి, ఏడీఈలు, సత్యనారాయణరెడ్డి, రాజేందర్, ఏఈలు తిరుపతి, శంకరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

## లాడ్జిలో ప్రింటింగ్ మిషన్

**● పోలీసుల విచారణ**

కరీంనగర్ క్రైం, మే 12: కరీంనగర్ బస్టాండ్ సమీపంలోని ఒక లాడ్జిలో ఆదివారం రాత్రి పోలీసులు నిర్వహించిన తనిఖీలలో ఒక ప్రింటింగ్ మిషన్‌తో ఉన్న వ్యక్తులను పోలీసులు విచారించారు. ఓ పార్టీకి చెందిన వారు పోలింగ్ చిట్టీలను ముద్రించేందుకు ఆ ప్రిటింగ్ మిషన్ కలిగిఉన్నట్లు విచారణలో వెల్లడైందని సీఐ సరిలాల్ తెలిపారు. కాగా లాడ్జిలో ఈవీఎం దొరికిందని ప్రచారం జరిగింది. దీనిని తప్పుడు ప్రచారంగా పోలీసు అధికారులు పేర్కొన్నారు.



వెబ్ కాస్టింగ్ కేంద్రంలో రిపోర్టు చేస్తున్న సిబ్బంది



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద రిపోర్టు చేస్తున్న సిబ్బంది



పెద్దపల్లి నుంచి సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

జ్యోతినగర్, మే 12 : పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని రామగుండం సెగ్మెంట్‌లో పోలింగ్‌కు అంతా సిద్ధం చేశారు. ఆదివారం ఎన్టీపీసీ టీటీఎస్ జడ్పీ స్కూల్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ ఆధ్వర్యంలో ఆయా పోలింగ్ కేంద్రాల సిబ్బందికి ఈవీఎం, ఇతర ఉపకరణాలను పంపిణీ చేశారు. అంతకు ముందే ర్యాండమైజేషన్ చేసిన ఈవీఎం, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్లను పోలింగ్ ఆఫీసర్, ఏపీవో, సిబ్బందికి అందజేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ యంత్రాల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. మధ్యాహ్నం తరువాత పోలీసు ఎస్కార్ట్‌తో వాహనాల్లో పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

## పోలింగ్‌ను కట్టుదిట్టంగా నిర్వహించాలి

పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి సిబ్బంది పోలింగ్ ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించాలని రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. సోమవారం జరిగే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆర్‌వో ముజమ్మిల్ ఖాన్ రామగుండం సెగ్మెంట్‌కు సంబంధించిన ఎన్టీపీసీ టీటీఎస్ జడ్పీ స్కూల్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఆదివారం ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి పంపిణీ. తరలింపు ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రిజర్వు ఈఎంలు సెక్టర్ అధికారుల వద్ద అందుబాటులో ఉంచామని, ఎన్నికల నియమ, నిబంధనలను పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా విలేకరుతో ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ విలేక రులతో మాట్లాడుతూ రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సిబ్బందికి పోలింగ్ సామగ్రిని కార్యక్రమం సాఫీగా జరిగిందని, ఈ సెగ్మెంట్లో ఉన్న 260 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సజావుగా సాగేం దుకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో 1850 పోలింగ్ కేంద్రాల వద్ద మే 13 సోమవారం జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వేసవి దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద చల్లని తాగు నీరు, క్యూ లైన్లకు టెంట్లను, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామన్నారు. ప్రజలు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఆర్‌వో ముజమ్మిల్‌ఖాన్ కోరారు. ఓటు భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, ప్రజలు ప్రలోభాలకు లోనుకాకుండా ఆలోచించి ఓటువేయాలని కోరారు. జిల్లా పరిధిలో అత్యధిక శాతం పోలింగ్ శాతం నమోదు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వెంట అదనపు కలెక్టర్లు జె.అరుణశ్రీ, హనుమా నాయక్, అధికారులు ఉన్నారు.

**మంథని :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మంథని నియోజకవర్గంలో



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

నేడు పోలింగ్ జరుగుతుంది. నియోజకవర్గంలోని 10 మండలాల్లో ఉన్న 288 పోలింగ్ స్టేషన్లలో జరిగే ఎన్నికల నిర్వాహణ కోసం మంథని ఆర్డీవో, ఏఆర్‌వో హనుమానాయక్ ఆధ్వర్యంలో అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లుచేశారు. ఆదివారం రామగిర మండలంలోని సెంటనరీకాలనీలోని మంథని జేఎన్‌టీయూ కళాశాల నుంచి వారికి కేటాయించిన వాహనాల్లో పోలింగ్ అధికారులు, సిబ్బంది సామగ్రితో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు తరలివెళ్లారు. మావోయిస్టు నక్సల్స్ ప్రాబల్య ప్రాంతమైన మంథని నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రశాంతంగా జరిగే విషయంలో ఇటు మారుమూల గ్రామీణ ప్రజల్లో, అటు పోలింగ్ నిర్వాహణ అధికారులు, పోలీస్ యంత్రాంగంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్..

మావోయిస్టు నక్సల్స్ ప్రాబల్యాన్ని దృష్టిలో పెట్టుకొని మంథని నియోజవర్గంలోనే పోలింగ్ నిర్వాహణ సమయాన్ని ఒక గంటను కుదించి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ ముగించడానికి చర్యలు తీసుకున్నారు. మంథని నుంచి పోలింగ్ సిబ్బంది, సామాగ్రితో బయలుదేరిన వాహనాలు సురక్షితంగా రాత్రి వరకు తమ కేటాయించిన గమ్య స్థానాలకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది.

## పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్..

మంథని జేఎన్‌టీయూహెచ్ కళాశాల ఆవరణలో ఉన్న మంథని నియోజకవర్గ పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి ముజిమ్మిల్లా ఖాన్ ఆదివారం పరిశీలించారు. ఉద్యోగులతో మాట్లాడి పంపిణీ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌వో హనుమానాయక్‌కు, ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

**ధర్మారం :** పార్లమెంట్ ఎన్నికలకు ధర్మారం మండలంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామగ్రితో ఆయా పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. మండలంలో 29గ్రామాల్లో 48401 ఓటర్లకు 53 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మండలంలో 45వేల ఓటర్లలల్లో మహిళలు 23404, పురుషులు 24994, ఇతరులు ముగ్గురు ఉన్నారు. ఇందుకు 450 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. కాగా ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా భారీ పోలీసులు మొహరించారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుందని అధికారులు వివరించారు. ఓటు వేయడానికి వచ్చే ప్రతి ఓటరు ఏదేని గుర్తింపు వెంట తీసుకురావాలని వారు తెలిపారు.

**పెద్దపల్లి రూరల్ :** మండలంలో సోమవారం నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి అయినట్లు తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి మండలంలోని 30 గ్రామాల్లో 101 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా 92 వేల 505 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఓటు వేసేందుకు వచ్చే వారి కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ బూత్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం వరకు సిబ్బంది చేరుకోగా గ్రామస్థాయి అధికారులు స్వాగతం పలికారు. ఓటు హక్కు వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

**ఓదెల :** మండలంలో సోమవారం నిర్వహించే పార్లమెంట్ ఎన్ని కల నిర్వహణకు అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల వ్యాప్తంగా 22 గ్రామాల్లో 40 పోలింగ్ బూత్‌లు ఉండగా 35వేల 274 ఓటర్లు ఓటు హక్కును వినియోగింయచుకోనున్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. పోలింగ్ కేంద్రాల్లో వికలాంగులకు, వృద్ధులకు, మహిళలకు ఇబ్బందులు కాకుండా సౌకర్యాల ఏర్పాట్లు పూర్తి చేశారు.

**పాలకుర్తి :** పార్లమెంటు ఎన్నికల ప్రక్రియలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం ఈవీఎంలు, ఎన్నికల సామ గ్రిని ఆదివారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు అసిస్టెంటు ప్రిసైడింగ్ అధికారులు సిబ్బందికి అందజేశారు. బస్సుల్లో ఎన్నికల అధికారులు, సిబ్బంది ఈవీఎంలు, సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు జరగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**ముత్తారం :** మండలంలో 14 గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 25 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుమన్ తెలిపారు. సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం సిబ్బంది ఆదివారం సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం మిషన్‌లతో చేరుకున్నారు. వారిని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించారు.

**ఎలిగేడు :** పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న అధికారులకు సెక్టోరల్ ఆఫీసర్ ఉమాపతి, పంచాయతీ కార్యదర్శి ఆకుల సౌమ్యలు స్వాగతం పలికారు. మండలంలో 22పోలింగ్ బూతులు ఉండగా, సాయంత్రం స్వాగతం పలికిన అనంతరం వారికి కేటాయించిన పోలింగ్ బూతులకు వెళ్లిపోయారు.



రామగుండంలో ఈవీఎంలను తీసుకువస్తున్న సిబ్బంది



జేఎన్‌టీయూలో పోలింగ్ కేంద్రాలకు తరలివెళుతున్న సిబ్బంది



పోలింగ్ కేంద్రాల కేటాయింపు వివరాలు చూసుకుంటున్న సిబ్బంది



స్ట్రాంగ్‌రూం వద్ద కేంద్ర బలగాల బందోబస్తు




ధర్మారానికి చేరిన పోలీస్ బలగాలు



ముత్తారంలో సిబ్బందిని ఆహ్వానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు



నిమ్మనపల్లి గ్రామానికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది



జయ్యారంలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

# 'సింగరేణి కార్మికుల సమయాలను మార్చాలి'

గోదావరిఖని, మే 12: సింగరేణి ప్రాంతంలో 20 రోజులుగా 45డిగ్రీల ఉష్ణోగ్రతదాటడం వల్ల ఓపెన్‌కాస్టులు, సీహెచ్‌పీ, వర్క్‌షాప్, డిపార్ట్‌మెంట్లలో పని చేసే కార్మికులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని, గతంలో కంటే అధిక ఉష్ణోగ్రతల వలన రెండు గంటల సమయాన్ని తగ్గించి గతంలో లాగా టైమింగ్స్ మార్చి పనులు కల్పించాలని మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎంతో మాట్లాడం, యాజమాన్యం ఒప్పుకుంది, ఇది మా విజయం అంటూ సర్కారు సంఘం ఐఎన్‌టీయూసీ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు పోటీ పడి ప్రచారం చేసుకోగా 8గంటల పని విధానంతోనే టైమింగ్స్ మార్చి కార్మికులకు విధులు కేటాయిస్తున్నట్టుగా యాజమాన్యం ప్రకటించిందన్నారు. పైరవీలకు అలవాటు పడి తప్పుడు సలహాలు ఇస్తూ కార్మికుల హక్కులను, సౌకర్యాలను యాజమాన్యానికి తాకట్టు పెడుతున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వేసవి టైమింగ్స్ విషయంలో కూడా అదే ప్రయత్నం చేశారన్నారు. ఇప్పటికీ 20రోజుల ఎండకాలం దాటిపోతున్నా పని గంటలు తగ్గించకపోవడం, చర్చల పేరిట కాలయాపన చేయడం అన్యాయమన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల కేంద్ర నాయకులు, అధికారులు కుమ్మక్కై వివిధ కోర్కెలతో, కండీషన్స్‌తో కార్మికులపై పనిభారం పెంచే కుట్రలను మానుకోవాలని సూచించారు. తక్షణమే యాజమాన్యం 6 గంటల పని విధానాన్ని టైమింగ్స్ మార్చి అమలు చేయాలని, టార్గెట్ పూర్తిచేయడం లాంటి అమలు కాని కండీషన్స్‌ను ఉపసంహరించుకోవాలని, కార్మికులకు కూల్ వాటర్ బాటిల్స్, ఎలక్ట్రోల్ ప్యాకెట్స్, చల్ల ప్యాకెట్లను అందించాలని డిమాండ్ చేశారు.

మోసపూరితంగా వ్యవహరిస్తున్న ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులను కార్మికులు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు కార్మికులను మోసగించే పద్ధతులు మానుకోవాలని హెచ్చరించారు.

## వైకే ఫౌండేషన్‌కు ఉగాది స్వర్ణనంది అవార్డు

ఖైటింక్లయిన్‌కాలనీ, మే 12: ఉగాది స్వర్ణ నందిని అవార్డు-2024ను వైకే ఫౌండేషన్‌కు వరించింది. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్, లంబోదర కల్చరల్ అకాడమీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సేవా రంగంలో విశేష సేవలను అందిస్తున్న సంస్థలకు క్రోధినామ సంవత్సర ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. రక్తదానంపై ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాల నిర్వహణ, వేలాది మందికి రక్తదానం చేసినందుకు గాను వైకే ఫౌండేషన్ అవార్డుకు ఎంపికైంది. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేష్‌ను సినీ దర్శకుడు రాజ్ స్వరూప్, హ్యూమన్ రైట్స్ సంస్థ ఛైర్మన్ డా.బాబులు సత్కరించి, అవార్డును ప్రదానం చేశారు.

## ఎన్నికలకు పటిష్ట బందోబస్తు
-సీపీ శ్రీనివాస్



పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, మే 12: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 3300 మంది పోలీసులతో ఎన్నికల బందోబస్తు నిర్వహిస్తున్నట్టు రామ గుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీపీసీలో కేంద్రం నుంచి పోలింగ్ సిబ్బంది కేటాయింపును ఆయన పరిశీలించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. 832మంది సివిల్, 384మంది వింగ్‌ఫోర్స్, 300 మంది హోంగార్డులు, 300మంది ట్రైనీ కానిస్టేబుల్, 700మంది ఛత్తీస్‌ఘడ్ హోమ్‌గార్డులు, 91మంది సింగరేణి ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది, 64మంది స్పెషల్ పార్టీ సిబ్బంది, 12 సీటీసీ వరంగల్ సిబ్బంది, 443మంది సీఆర్‌పీఎ, బీఎస్‌ఎఫ్‌కు చెందిన ఐదు కంపెనీల బలగాలతో పాటు 90మంది ఎన్‌సీసీ కెడెట్లు కూడా బందోబస్తు చర్యల్లో పాల్గొంటున్నారన్నారు. సోమవారం జరగనున్న పోలింగ్‌ను పర్యవేక్షించేందుకు కమిషనరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి నిఘా పెట్టామన్నారు. కమిషనరేట్ పరిధిలో 144సెక్షన్ అమలులో ఉందని, పోలింగ్ కేంద్రాల వద్ద గుమికూడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని సీపీ కోరారు.

## విద్యార్థిని అభినందించిన మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, మే 12: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని పర్ష మాధురిని మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం అభినందించి సన్మానించారు. మండలం మల్లారం గ్రామానికి చెందిన పర్ష సంతోష్ కుమార్-కోమలతల కుమార్తె మాధురి ఇంటర్ ఫలితాల్లో బైపీసీ మొదటి సంవత్సరంలో 440 మార్కులకు 434 మార్కులు సాధించడంతో మంత్రి శ్రీధర్ బాబు అభినందించి సన్మానించారు. భవిష్యత్తులో డాక్టర్ అవుతా అని విద్యార్థి మాధురి అనడంతో మంత్రి శ్రీధర్ బాబు సమాజానికి సేవ చేయాలని సూచించారు. పర్ష మాధురి తండ్రి సంతోష్ కుమార్ ఒగ్గు కళాకారుడు, తల్లి వ్యవసాయ కూలీ, కష్టపడి పట్టుదలతో చదివినందుకు విద్యార్థిని మాధురిని మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించి, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చని, విజయం సాధించిన వారంతా గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన వారేనని తెలిపారు. ఎంపీపీ కొండ శంకర్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు ప్రేరణ తరగతులు

ధర్మారం, మే12: ధర్మారం మండలం మల్లాపూర్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో ఆదివారం ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులకు ఉచిత మోటివేషన్ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు చదివిన విషయాలు మరిచిపోవడానికి గల కారణాలను ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్రావ్ వివరించారు. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విషయాన్ని విజయానికి పునాదిగా వాడుకోవాలని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కరీంనగర్ ప్రెసిడెంట్ కుతాడి తిరుపతి అన్నారు. మేథాశక్తితో ప్రశాంతంగా చదువుకోవాలని ట్రైనర్ ఆవుల సుధాకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరిజ, వైస్ ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మే 12: మండలంలోని పెద్దరాతుపల్లిలో తాడిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రాగుల శ్రీనివాసగౌడ్ తాడిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. శ్రీనివాసగౌడ్ నడుముకు, కాళ్లకు చేతులకు బలమైన గాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు.

## రెడ్డి సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారం

కోల్‌సిటీటౌన్, మే 12: గోదావరిఖని రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఆదివారం స్థానిక రెడ్డి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా చింతల రాజిరెడ్డి, అధ్యక్షుడిగా ఈద జగన్‌మోహన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంకణాల ముకుందరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉమ్మెంతల దేవేందర్‌రెడ్డి, కోశాధికారిగా చందుపట్ల తిరుపతి రెడ్డితో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఈద జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంఘం సంక్షేమ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు, రెడ్డి కులస్తులు పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు

సుల్తానాబాద్, మే 12: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను మండలంలోని కదంబాపూర్ గ్రామస్థులు శనివారం అర్ధరాత్రి అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించగా టిప్పర్లను సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్థానికుల కథనం ప్రకారం కొన్ని రోజులుగా ఐదారు భారీ టిప్పర్లు ప్రభుత్వ అవసరాల నిమిత్తం ఇసుక రవాణా అంటూ బ్యానర్లను తగిలించుకుని మండలంలోని కదంబాపూర్ గ్రామంలోని మానేరు నుంచి ఇసుకను తరలిస్తున్నాయన్నారు. శనివారం రాత్రి నాలుగు టిప్పర్లను అడ్డుకోగా మూడు పట్టుబడ్డాయని స్థానికులు తెలిపారు. వాటికి ఇసుకను తరలించడానికి ఎలాంటి ప్రభుత్వ పరమైన అనుమతులు లేవన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వాటిని స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల కోసం తహసీల్దార్‌కు సమాచారం అందించామని ఎస్‌ఐ తెలిపారు.

## మిత్రుల ఆర్థిక సహాయం

పెద్దపల్లి కల్చరల్, మే 12: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న పెద్దపల్లి పట్టణానికి చెందిన కుడికాల శంకర్‌కు ఆయన మిత్రులు రూ.లక్ష 38వేల ఆర్థిక సహాయం అందించారు. శంకర్‌తో పాటు గోదావరిఖని సెక్రెడ్ హైస్కూల్లో 1981-82 ఏడో తరగతి చదివిన విద్యార్థులు ఆయనను కలిసి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన మిత్రులు ఎం వెంకటేశ్వర్‌రెడ్డి పి స్వామి వెంకటలక్ష్మి, జయలక్ష్మి, విక్టోరియా ,అప్సర్, తిరుపతి, ప్రకాష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మదర్స్ డే



మదర్స్ డే వేడుకలో పాల్గొన్న బాలికలు, తల్లులు

జ్యోతినగర్, మే 12: మదర్స్ డేను ఆదివారం ఎన్టీపీసీలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి ఆధ్వర్యంలో టౌన్‌షిప్‌లో నిర్వహిస్తున్న బాలికా సాధికారత మిషన్(జెమ్) శిక్షణా శిబిరంలో మాతృ దినోత్సవాన్ని నిర్వమించారు. వర్క్‌షాప్‌లో ఉన్న బాలికలు, వారి తల్లుతో మదర్స్ డేను ఉత్సాహంగా నిర్వహించారు. తమ పిల్లలతో వేడుకుల్లో పాల్గొన్న తల్లులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దీప్తి మహిళా సమితి ఉపాధ్యక్షురాలు జ్యోత్స్న త్రిపాఠి మాట్లాడుతూ ఈ సృష్టిలో అమ్మ ప్రేమను వెల కట్టలేమని, తల్లులు తమ పిల్లల కోసం జీవితాంతం త్యాగం చేస్తారని, శ్రమిస్తారన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దీప్తి మహిళా సమితి నాయకురాలు వి.పద్మశ్రీ, సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.